## క్లుప్తంగా

### కొత్తమ్మవారికి నిమ్మకాయలతో అలంకరణ



నిమ్మకాయల దండల అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డులు సంతపేట, కొత్తపేట పరిసర గ్రామాల దేవత కొత్తమ్మతల్లికి మంగళవారం నిమ్మకాయల దండలతో అలంకరించి భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో కొల్లి సత్యనారాయణ, సూర్య తదితరులు ఈ అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి అమ్మవారిని అలంకరించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ప్రారంభం



చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులకు పాలు, గుడ్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా మంగళవారం భీమిలి జోన్ 2వ వార్డు సంతపేట చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులకు మార్షల్ ఆర్ట్స్(కిక్ బాక్సింగ్, కరాటే)లో శిక్షణ ప్రారంభించారు. బ్లాక్ బెల్ట్ గ్రహీత, కోచ్ బంగారు గౌతం ఆధ్వర్యంలో రోజూ ఉదయం 6 నుంచి 7.30 వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుంది. శిక్షణలో పాల్గొనే పిల్లలకు పౌష్టికాహారం అందించనున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోడిగుడ్లు, పాలు, బిస్కట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రధానకార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, మద్ది లక్ష్మి, తేజేంద్రరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మరిడమ్మ ఉత్సవ చాటింపు



అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భీమునిపట్నం : భీమిలిలోని యాదవ కుల దేవత మరిడమ్మవారి ఉత్సవాలకు ముందు నిర్వహించే అమ్మవారి చాటింపు వేడుక సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయం వద్దకు భాజాభజంత్రీలు వాయిస్తూ, బాణసంచా కాల్చుతూ ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ మంగళవారం తెలిపింది.

### క్రీడలతో విద్యార్థుల్లో చురుకుదనం



శిక్షణ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అప్పలకొండ

భీమునిపట్నం : క్రీడల ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం పెరిగి, వారి భవిష్యత్తు బాగుంటుందని 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ అన్నారు. స్థానిక ప్రభుత్వ పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాల వద్ద కిక్‌బాక్సింగ్, హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడలతో పోటీ తత్వం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి, కోచ్‌లు రాజారావు, లక్ష్మి పాల్గొన్నారు.



# కొండపై పెళ్లంటే హడల్



ప్రైవేట్ మార్కెట్ వైపు కూలిన ప్రహరీ

- సత్యనారాయణస్వామి కొండపై వసతుల లేమి
- కొండ మీద వివాహాలకు తల్లిదండ్రుల అనాసక్తి
- వసతుల ఏర్పాటుకు నిధుల కోసం నిరీక్షణ

**వరాలిచ్చే దేవుడే విరాళాల కోసం వేచి చూస్తున్నాడు. ఇక్కడ తమ బిడ్డలకు వివాహం జరిపితే సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు కాపురం చేసుకుంటారని నమ్మిన తల్లిదండ్రులే ఇపుడు.. అమ్మో.. ఆ కొండపైనా.. వద్దు బాబోయ్ అంటున్నారు. ఇదంతా తగరపువలస నడిబొడ్డున ఎనిమిది దశాబ్దాల క్రితం వెలసిన శ్రీ రమాసత్యనారాయణ స్వామి ఆలయం ప్రస్తుత దుస్థితి గురించే..!**



కొండపై పెళ్లిళ్లు నిర్వహించుకునే ముఖ మండపం

తగరపువలస : సత్యనారాయణస్వామి వ్రతాల కోసం అన్నవరం వెళ్లలేని వారికి భీమిలి నియోజకవర్గం పరిధి తగరపువలస కొండపైనున్న రమా సత్యనారాయణస్వామి ఆలయమే పెద్ద దిక్కు. పెళ్లిళ్ల సీజన్లో ఇక్కడ వ్రతాలకు బాగా డిమాండ్. ఈ కొండపై ఆలయంలో తమ పిల్లలకు వివాహాలు జరిపిస్తే సుఖసంతోషాలతో ఉంటారని ప్రతీతి. పెళ్లిళ్ల సమయంలో కొండ దిగువ భాగం నుంచి శిఖరం వరకు విద్యుద్దీప కాంతులతో మిలమిలా మెరిసిపోయేది. మేళతాళాల సంబరాలు కొండ చుట్టుపక్కల గ్రామాలకు ప్రతిధ్వనించేవి. ఇదంతా గతం. ప్రస్తుతం కొండపై పెళ్లంటే ఇరువర్గాలవారు హడలిపోతున్నారు.

**వసతులు పూజ్యం**

శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే వందకు పైగా మెట్లు ఎక్కాలి. శిథిలమైన మెట్ల మార్గం, చీలుతున్న బండరాళ్లు, పైన కూలిన ప్రహరీ ఇలా ప్రతి ఒక్కటీ సమస్యగానే ఉంది. రాత్రుళ్లయితే.. చీకట్ల కారణంగా విషపురుగుల సంచారంతో పెళ్లివారు ఆందోళన చెందుతున్నారు. ఎలాగోలా గత నమ్మకాల బలంతో సరిపెట్టుకుని కొండపైకి చేరుకున్నా టాయిలెట్లు, తాగునీటి వసతి లేకపోవడంతో కొండపై పెళ్లిళ్లు అంటేనే విముఖత ప్రదర్శిస్తున్నారు. బంధువులు కూడా కొండపై పెళ్లికి వచ్చేందుకు ఇష్టపడక, సాకులు వెతుక్కుంటున్నారు.

**ఆదాయ వనరులు నిల్!**

మెట్లు ఎక్కలేక, కొండపై పరిస్థితులు బాగాలేక ఇటీవల కాలంలో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయిదేళ్ల క్రితం సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం ఈవో పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ప్రత్యేకంగా తీసుకున్నా ఆదాయ వనరులు తక్కువగా ఉన్నందున ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. పూర్వం ఆలయ ప్రతిష్ఠ జరిగినప్పుడే కొండచుట్టూ పది ఎకరాలు దేవస్థానానికి కేటాయించారు. ఆ భూములన్నీ ఎప్పుడో ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవల ఈ ఆలయ బాధ్యతల్ని పాండ్రంగి(పద్మనాభం) వేణుగోపాలస్వామి ఆలయ ఈవోకు అప్పగించారు.

**ముత్తంశెట్టిపైనే భారం**

భక్తుల ఆదరణ తగ్గిపోవడంతో ఆలయ ఆదాయం కనీస స్థాయికి పడిపోయింది. దైనందిన నిర్వహణకు కూడా నిధులు వెతుక్కునే పరిస్థితి. దీంతో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు సమీప గ్రామస్తులు, ఆలయ అధికారులు మొరపెట్టుకున్నారు. ఆయన జీవీఎంసీ నుంచి రూ.12 లక్షలు కేటాయించేలా కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుతం ఆలయంలో ఏ చిన్నపని జరగాలన్నా అర్చకుడు వివేకానందశర్మ, దాతలపై ఆధారపడటమో, తన కున్న స్థాయిలో భరించడమో జరుగుతోంది. కొండ దిగువ భాగాన బోరు తవ్వించినా, కొండపైకి నీరు పంపించేందుకు అవసరమైన సామాగ్రికి రూ.25 వేలు ఖర్చు చేయాలి. ఆ మేరకు కూడా నిధులు లేక, మధ్యలోనే చేతులెత్తేసిన పరిస్థితి.



శిథిలమైన మెట్ల మార్గం

**ప్రభుత్వం దృష్టికి వసతుల సమస్య**

సత్యనారాయణస్వామి కొండపై భక్తులకు పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు సంబంధించి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. చిన్న చిన్న వసతుల్ని దాతలిచ్చే విరాళాల ద్వారా సమకూర్చుకునేలా ఆలయ కమిటీ పాలకవర్గాన్ని కోరుతున్నాం. మిగిలిన వసతుల కల్పనకు మరోమారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాను. వీలైనంత వేగంగా నిధుల మంజూరుకు ప్రయత్నిస్తా.

– నానాజీబాబు, ఈవో, దేవదాయశాఖ

## నాలుగేళ్ల పాలనలో నలభయ్యేళ్ల అభివృద్ధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : నాలుగేళ్ల పాలనతో 40 ఏళ్ల అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం, ఎస్సీకాలనీ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదరిక రహిత ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. పేదరికాన్ని రూపుమాపేందుకే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందిస్తున్నట్టు పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలతో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుతోందన్నారు. పిల్లల చదువుకోసం జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రియంబర్స్‌మెంట్, అమ్మఒడి వంటి మహత్తర సంక్షేమ పథకాలతో భావి తరాల అభ్యున్నతికి సీఎం జగన్ చేయూతనిస్తున్నారని తెలిపారు. జీవీఎంసీలో విలీనం తర్వాత కె.నగరపాలెం, కాపులుప్పాడ, నిడిగట్టు, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, తహసీల్దార్ వేణుగోపాల్, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వ్యవసాయశాఖ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిలంబమ్‌లో అన్నవరం చిన్నారుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ శ్రీనివాసరావు, వెటరన్ క్రీడాకారుడు ఎల్లాజీ

తగరపువలస : భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు ఈ నెల 21న తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన 4వ జాతీయ స్థాయి సిలంబమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ పతకాలు సాధించారు. 11 కిలోల విభాగంలో కుంచం కుష్వంత్ కుమార్( 7వ తరగతి) గోల్డ్ మెడల్, 13 కిలోల విభాగంలో కుంచం సుప్రియ(8వ తరగతి) బ్రాంజ్ మెడల్, 9 కిలోల విభాగంలో శీరం వినయ్ ఈశ్వర్(4వ తరగతి) 2 బ్రాంజ్ మెడల్స్, 14 కిలోల విభాగంలో విద్యార్థి అల్లిపల్లి లక్ష్మీనారాయణ(9వ తరగతి) బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం అన్నవరంలో వీరిని అభినందించారు. కోచ్ నాగిడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మాన, ప్రాణ రక్షణ, దాడుల నుంచి తప్పించుకునేందుకు ప్రాచీన విద్య అయిన సిలంబమ్ దోహదపడుతుందన్నారు. ఇప్పటివారికి కత్తి, బల్లెం, మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆత్మరక్షణ విద్య అవసరమన్నారు. ఇదే గ్రామానికి చెందిన వెటరన్ క్రీడాకారుడు అల్లిపిల్లి ఎల్లాజీ మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ఎన్నో వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇదే స్ఫూర్తితో అన్నవరంలోని మరింత మంది మత్స్యకార చిన్నారులకు శిక్షణ ఇప్పించనున్నట్టు వెల్లడించారు.

## స్థలంపై ఇరువర్గాల ఆందోళన



ఆధారాలు చూపిస్తున్న రైతులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట తీరప్రాంతం వద్దనున్న స్థలం కోసం ఓ వైపు రైతులు, మరో వైపు మత్స్యకారులు ఆందోళనకు దిగారు. సూరాడ బండయ్యకు చెందినట్టుగా చెప్తున్న తీరానికి ఆనుకుని ఉన్న జిరాయితీ భూమిని వారి కుమారులు నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఇటీవల విక్రయించారు. ఇదే స్థలంలో మత్స్యకారులు వేటకు వెళ్లే వాడుక రోడ్డు ఉందని, దాన్ని తమకు వదిలేయాలంటూ మత్స్యకారులు ఆందోళనకు దిగారు. మరో వైపు తాము డాక్యుమెంట్ ప్రకారమే ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్టు స్థల యజమాని చెప్తున్నారు. మంగళవారం రోడ్డు భాగం వదలాలని మత్స్యకారులు ఓ వైపు ఆందోళన చేయగా, కొనుగోలు చేసిన యజమాని తరఫున, ఆ స్థలాన్ని విక్రయించిన రైతులు మరోవైపు ఆందోళనకు దిగారు. ఇన్నాళ్లూ ఆ స్థలాన్ని మార్గంగా వారు వినియోగించారు తప్ప, ఆ స్థలం తమదేనని, అందుకు తమ దగ్గరున్న ఆధారాలను చూపారు.

**ఆ స్థలంతో నాకు సంబంధం లేదు**

ఇక్కడ స్థల వివాదానికి తనకు ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పార్టీని, తమను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఈ స్థలం విషయంలో తన పేరును వాడుతున్నారని పేర్కొన్నారు. మరో సారి ఎవరైనా ఈ విషయంలో తన పేరును ప్రస్తావిస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నుయ్యిలా.. భారీ గొయ్యి



కొండపేటలో పైపులైన్ పగిలిపోగా తవ్విన గొయ్యి

తగరపువలస : భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట గోస్తనీనదీ తీరంలోని పంప్‌హౌస్ నుంచి భీమిలి పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ పగిలి రిజర్వాయర్ సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. రెండు వారాల క్రితం పగిలిన ఈ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించలేదు. గోతిని పూడ్చలేదు. నెలలో నాలుగైదుసార్లు ఇదే ప్రదేశంలో పైపులైన్ పగలడం, వారాల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడం రివాజుగా మారింది. పైపులైన్ నుంచి నీరు విడుదలై గొయ్యి నిండిపోతోంది. రోజుల తరబడి నీటి నిల్వ కారణంగా నాచుకట్టి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇళ్ల ముందు గొయ్యి కారణంగా పునాదులు దెబ్బతింటున్నాయని, చిన్నారులు పొరపాటున ఇందులో పడితే ఊహించని నష్టం జరిగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనాదారులు ప్రమాదాలకు గురి కాకుండా రాళ్లు, చెట్ల కొమ్మలు అడ్డుపెడుతున్నారు. మూడేళ్లుగా తరచూ ఇక్కడ పైపులైన్ పగిలిపోతున్నా ఇంజినీరింగ్ సిబ్బంది శాశ్వత చర్యలు చేపట్టడం లేదని కొండపేటవాసులు ఆక్షేపిస్తున్నారు.

## చురుగ్గా రెండో విడత జియో ట్యాగింగ్



గిడిజాలలో జియో ట్యాగింగ్‌కు హాజరైన మధురవాడ ప్రాంత లబ్ధిదారులు



లబ్ధిదారుల కోసం గిడిజాలలో నిర్మిస్తోన్న ఇళ్లు

మధురవాడ : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జీవీఎంసీ జోన్–2 పరిధిలోని పలు వార్డులకు చెందిన లబ్ధిదారులకు రెండో విడత జియోట్యాగింగ్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మధురవాడ ప్రాంత హౌసింగ్ లబ్ధిదారులకు ఆనందపురం మండలం గిడిజాల–2, గిడిజాల–3, తంగుడుబిల్లి లే అవుట్లలో కేటాయించిన స్థలాల్లో జియోట్యాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన గృహ నిర్మాణ శాఖ ఏఈ సూర్యప్రకాష్ మాట్లాడుతూ లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు రాయితీగా ఇస్తున్నట్టు తెలిపారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని అందిస్తున్నట్టు పేర్కొన్నారు. లబ్ధిదారుల మూడో ఆప్షన్ మేరకు ప్రభుత్వమే ఇళ్లు కట్టిస్తున్నట్టు వెల్లడించారు. ఈ జియో ట్యాగింగ్ మేళా మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. లబ్ధిదారులు జియో ట్యాగింగ్ కోసం ఎమినిటీ సెక్రటరీలను సంప్రదించాలని సూచించారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ సంగివలస ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ బొట్ట రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. దీంతో ఊళ్లపేట, నమ్మివానిపేట, ఇడదాసరిపేట, అనిట్స్ కళాశాల, చిల్లపేట, జీరుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## చెరువు మట్టి తవ్వకాలపై ఆర్డీవోకు ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న దేముడుబాబు, అప్పలరమణ

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీలో చెరువు, పంట కాలువల్లో మట్టిని అక్రమంగా తవ్వి, లారీలతో అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆర్డీవో భాస్కరరెడ్డికి పాండ్రంగి కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆర్.ఎస్.దేముడుబాబు, పంచాయతీ కార్యదర్శి మహంతి అప్పలరమణ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవోను కలిసి వివరాలు తెలిపారు.

## విచ్చలవిడిగా వ్యర్థాలు.. క్షీణిస్తున్న పారిశుధ్యం



భీమిలి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న చెత్త కుప్పలు

ఆనందపురం : మండలంలోని శివారు ప్రాంతాల్లో చెత్తాచెదారాలను విచ్చలవిడిగా పారవేయడంతో అపారిశుధ్యం నెలకొంది. పటిష్ట నియంత్రణ చర్యలు కొరవడి, వివిధ గ్రామాల నుంచి తెచ్చిన చెత్తను రహదారుల వెంబడి పారబోస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. భీమిలి క్రాస్‌రోడ్డు వద్ద భీమిలి వెళ్లే రూట్లో విశాలమైన ఖాళీ స్థలం ఉంది. దీంతో చుట్టూ పక్కల గ్రామాల వ్యర్థాలను ఇక్కడే గుట్టలుగా వేస్తున్నారు. ఈ ప్రదేశాన్ని ఆనుకునే విద్యా సంస్థలు, కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీకి స్థలాన్ని కూడా ఇక్కడే కేటాయించారు. గుట్టలుగా పేరుకుపోయిన ఈ చెత్తతో ఏ మాత్రం చినుకులు పడినా.. పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ఆనందపురం జంక్షన్ నుంచి పెందుర్తి వెళ్లే రూట్లో రోడ్డు పక్కనున్న దుకాణదారులు ఖాళీ కొబ్బరి బొండాలు, చికెన్ సెంటర్ల వ్యర్థాలను గుట్టలుగా పోస్తున్నారు. వీటిని తినేందుకు వచ్చే వీధి కుక్కలు, పందులతో పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారంతోపాటు దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడకు సమీపంలోనే బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తుంటారు. బస్సు, ఆటో వచ్చే వరకు ముక్కు మూసుకునే ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం

మధురవాడ : జీవీఎంసీ జోన్–2లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. వర్షం తేలిక పాటిదే అయినా ఉరుములు, మెరుపుల వేగం అందరినీ భయ కంపితులను చేశాయి. మధురవాడ, కొమ్మాది, పీఎంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడ్డాయి. ఓ చోట మేడపై ఆరబెట్టిన పరుపు గాలికి ఎగిరి, విద్యుత్ తీగల్లో చిక్కుకుంది. దీంతో కొమ్మాది, రేవళ్లపాలెం, మధురవాడ, బక్కన్నపాలెం తదితర ప్రాంతాల్లో రాత్రి 11.30 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షంతో కాస్త వాతావరణం చల్లబడినా కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది మధురవాడ సబ్‌స్టేషన్ ఏఈ ఎస్‌వీఎస్ రామమూర్తి ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు రాత్రికి రాత్రే చేపట్టారు.

## ప్రధానికి పోస్టు కార్డుల ద్వారా నిరసన



చిట్టివలస పోస్టుమాస్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

తగరపువలస : చిట్టివలస ప్రాంతీయ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి మంగళవారం పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ప్లకార్డులు చేతపట్టి లేబర్ వెల్ఫేర్ సెంటర్ నుంచి ర్యాలీగా చిట్టివలస పోస్టాఫీసుకు చేరుకున్నారు. పోస్ట్‌మాస్టర్ బోని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రధాని ఇచ్చిన హామీలలో కనీస పెన్షన్ రూ.9 వేలను అమలు చేయాలన్నారు. కరవు భత్యం, హయ్యర్ పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. పెన్షనర్లకు ఉచిత వైద్యం, రైల్వే ప్రయాణాల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మావూరి వీర్రాజు, అధ్యక్షుడు అల్లు బాబూరావు, ప్రధానకార్యదర్శి మల్లపురెడ్డి ప్రసాద్, సహాయకార్యదర్శి దామోదర బాబాజీ, కాసూరి రాంబాబు, రంగూరి ఈశ్వరరావు, నూలు ఆదినారాయణ, వానపల్లి కాళిదాసు, మోర అప్పలరాజు, సిటు నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు పాల్గొన్నారు.

## ఘనంగా ఉయ్యాల ఉత్సవం



ఉయ్యాల వేడుకలో ఉత్సాహంగా గ్రామస్తులు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పండగ చాటిన నెల రోజులు కావడంతో ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని జరిపారు. ఘటాలు మోసినవారు ఈ ఉయ్యాల ఊగారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని ఆనందంగా వీక్షించారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల వినతి



ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట : ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి 'ఉద్యోగుల వేదనలను చెపుదాం'కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించారు. మంగళవారం భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు తమ సమస్యల్ని నివేదిస్తూ, వినతి పత్రాలు సమర్పించినట్టు జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్‌రావు, కార్యదర్శి సీహెచ్ రమేష్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, రెవెన్యూ, వీఆర్ఏ, పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.